గ్రాఫిక్స్ కథలు

4

బంద్ 1999

ఆ రోజు ఆదివారం. అయితే మా కాలనీ వాళ్ళంతా కాలనీవేదిక దగ్గర గుమికూడింది అందుకోసం. మర్నాడు రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా జరిపిస్తున్న బంద్ గురించి మాట్లాడడానికి. మా కాలనీలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతోపాటు కొంతమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా వుండడంవల్ల మేమంతా బంద్‌లో పాల్గొనాలా వద్దా అనే విషయం చర్చిస్తున్నాం.

కాసేపటి తర్వాత మోటార్ సైకిల్స్ మీద ఉద్యోగ సంఘ నాయకులు హడావుడిగా వచ్చారు. వస్తూనే స్పీచ్ అందుకున్నాడో నాయకుడు.

"సోదర సోదరీమణులారా! మన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ బంద్‌తో సహకరిస్తామని ప్రభుత్వానికి మాట ఇచ్చాము. అందుకు ప్రతిఫలంగా ప్రభుత్వం మనకి ఒక్కొక్క ఉద్యోగికి అయిదు వందల రూపాయిల నగదు, ఒక జత టెర్లిన్ బట్టలు, ఒక పాలిస్టర్ చీర జాకెట్టు, ఒక కుంకుమ భరిణ, పిల్లలకు అట వస్తువులూ ఇస్తుంది. కనుక మీరంతా వెంటనే మీ మీ ఆఫీసులకెళ్ళి అవన్నీ తెచ్చుకోవలసిందిగా కోరుతున్నాం?"

అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్.

ఆడాళ్ళంతా కుంకుమ భరిణ, పాలిస్టర్ చీర సంగతి వింటూనే విప్పారిన మొఖాలతో బంద్‌వల్ల ఎన్ని లాభాలున్నాయో చర్చించుకోసాగారు.

ఈలోగా కేంద్ర ప్రభుత్వోద్యోగుల నాయకుడు స్పీచ్ మొదలుపెట్టాడు.

"సోదర సోదరీమణులారా! ఈ బంద్ మన దేశ ప్రయోజనాలకు భంగకరం అని మన కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కనుక మనందరం ఈ రాత్రికే ఆఫీసుల కెళ్ళి అక్కడే పడుకుని రేపు పూర్తి అటెండెన్స్‌తో పని చేయడానికి మన కార్మిక సంఘం అంగీకరించింది. ఇందుకు ప్రతిఫలంగా మనకు ఒక్కొక్కరికి ఆరు వందల రూపాయిల నగదు, ప్రతి కుటుంబానికి రైల్లో ఆలిండియా టూర్ చేసే ఫ్రీ పాసూ, రెండు చీరలు, పిల్లలకు ఉచితంగా యూనిఫారం, పుస్తకాలూ ఇస్తారు. ఇవికాక ఇవాళ రాత్రి ఆఫీసుల్లో గడిపే వారి టైమ్ పాస్ కోసం ప్రముఖ సినీ సెక్స్ డాన్సర్స్ ఒకో ఆఫీసుకు ఒక్కొక్కరు చొప్పున డాన్సులు చేస్తారు. ఇంతే కాకుండా ప్రతి నలుగురికి రెండు సెట్ల పేక ముక్కలు, దాన్తో పాటు వంద రూపాయిలు కిట్టిమనీ కూడా ఏర్పాటు చేశారు. ఇవికాక రాత్రి నాలుగు రకాల బ్రాందీ విస్కీలు, ఎనిమిది రకాల నాన్ వెజిటేరియన్ వంటకాలతో భోజనాలు, ఉదయం బెడ్ కాఫీ, కాఫీ ఫలహారాలు, మళ్ళీ మధ్యాహ్నం బఫే డిన్నర్‌లూ వుంటాయి. రాత్రి మంచాలూ యూఫోమ్ బెడ్స్ కూడా ఏర్పాటు చేసేయడం జరిగింది. రాత్రికి కొంత మంది వేశ్యలను ఏర్పాటుచేసే విషయం గురించి కూడా మన యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. కానీ ఇంకా వివరాలు తెలీదు."

దాంతో కేంద్ర ప్రభుత్వోద్యోగులందరూ తప్పట్లు కొట్టి ఎజిల్స్ వేసేరు ఆనందంగా. అయితే వాళ్ళ ఆడాళ్ళు మాత్రం కన్నుమంటూ లేచారు.

"ఏమిటే మా మగాళ్ళకు వేశ్యలను ఏర్పాటు చేస్తారా?" అంటూ వెంగుచోపుతుంటే నాయకుడు ఖంగారుపడ్డాడు." అబ్బే ఊరికే జోక్‌కి అన్నాను" అంటూ మాకేసి తిరిగి కన్ను కొట్టాడు.

మా అందరికీ కేంద్ర ప్రభుత్వోద్యోగులను మాస్తే ఈర్ష్య కలిగింది. వాళ్ళు పోయిగా ఆఫీసులో ఎంజాయ్ చేస్తుంటే మేము ఇంటిదగ్గర పడి చావాలి.

అప్పటికప్పుడే మేమంతా ఆఫీసులకెళ్ళి డబ్బూ, చీరలూ ఇతర వస్తువులూ అన్నీ డ్రా చేసుకుని ఇళ్ళకు చేరుకున్నాం.

మర్నాడు మేముకూడా నాలుగయిదు కుటుంబాలకు ఒక వి.సి.ఆర్., కొన్ని సినిమా కాసెట్లు తెచ్చుకుని హాయిగా గడపాలని నిర్ణయించుకున్నాం.

మరి కాసేపట్లో నాలుగు బస్‌లు వచ్చి కేంద్ర ప్రభుత్వో ద్యోగులకు డబ్బూ, ఇతర వస్తువులూ ఇచ్చి ఆఫీసులకు తీసుకెళ్ళిపోయినాయ్.

ఆ రాత్రి వెన్నెల్లో కూర్చుని మర్నాడు మగాళ్ళ కోసం కాలనీలో ఏమేం ఏర్పాట్లు జరపాల్సింది చర్చలు ప్రారంభించాము.

పేకాడేవాళ్ళంతా లక్ష్మణరావ్ వాళ్ళింట్లో సమావేశమయేట్టూ, ప్రత్యేక వంటకాలంటే పడిచచ్చే వారంతా బగారాబైగన్ వెంకట్రావ్ ఇంట్లో కలుసుకునేట్టు, ఇలా రకరకాల ఏర్పాట్లు చేసేస్తున్నారు. సరిగ్గా అప్పుడే ఓ జీప్, దాని వెనుక ఓ వ్యాన్ వచ్చి ఆగినయ్ మాకు కొద్ది దూరంలో.

అందులో నుంచి హోంమ్ మినిస్టర్, ఓ పోలీస్ అధికారి దిగారు.

"సోదరులారా! రేపు మనందరం కలసి కేంద్రానికి వ్యతిరేకంగా బంద్ చేస్తున్నామన్న విషయం మీకు తెలిసే వుంటుంది! బంద్‌వల్ల ఎన్ని లాభాలున్నాయో మీకందరకూ తెలిసే వుంటుంది. కేంద్ర ప్రభుత్వానికి ఒక్క రోజులో ఆరు వందల అరవై కోట్ల నష్టం వచ్చేలా చూడడం మనందరి ధ్యేయం అని నేను మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. ఈ టార్గెట్‌ని సాధించడం కోసం మనందరం ప్రాణాలకు తెగించి కేంద్ర ప్రభుత్వానికి చెందినటువంటి రైళ్ళు, టెలిఫోన్లు, దూరదర్శన్, ఆకాశవాణి లాంటి అనేక సంస్థలకు భారీ నష్టం కలుగజేయాల్సి వుంటుంది. అవసరమయితే కొన్ని రైళ్ళను ప్రయాణీకులతో సహా తగలబెట్టాలి మనం. ఎందుకంటే బంద్‌నాడు ప్రయాణం చేసే వారంతా కేంద్రంలోని అధికార పార్టీ వాళ్ళు గానీ, వాళ్ళ సానుభూతిపరులు గానీ అయుంటారని నేను నొక్కి వక్కాణిస్తున్నాను. ఏదీ అందరూ ఓసారి గట్టిగా అరవండి! 'రేపు మేమందరం ఎవరి ప్రోద్బలం లేకుండా మా అంతట మేమే స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నాం, –" అంటూ అరవాడతను.

యర్రంశెట్టి శాయి

మేమెవ్వరం అరవకపోయే సరికి అతనికి మా మీద కోపం వచ్చేసింది.

''మీకే చెప్పేది - అరవండి'' అన్నాడు మండి పడుతూ.

అయినా మేమెవ్వరం నోరు మెదకపోయేసరికి పోలీసు అధికారి వేపు తిరిగాడతను.

''మాశారా! నేను చెప్పలేదూ ఈ కొడుకులు ఆ పార్టీ వాళ్ళ దగ్గర పైసల్దిన్నారు. అందుకే అరవటం లే! పిల్వండి మీవాళ్ళను!'' అన్నాడు కోపం అణుచు కుంటూ.

మరుక్షణంలో వ్యాన్‌లో నుంచి పాతిక మంది కానిస్టేబుల్స్ తుపాకులు తీసుకుని మమ్మల్నందరినీ

చుట్టుముట్టారు. రంగారెడ్డిని బట్‌తో ఒక్క పోటు పొడిచాడో పోలీసు అధికారి.

''మాస్తారేమ్రిటా అరవండి! బంద్ గురించి గవర్నమెంట్ దగ్గర అయిదొందలు తీస్కుని ఇంకేం రోగం, అరవటానికి?''

అప్పటికీ అరవకపోతే ఏం జరుగుతుందో మాకు తెలుసు.

అందుకని వెంటనే అరచేశాము.

''రేపు మేము ఆనందంగా, సంతోషంగా, స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొంటున్నాము.

ముఖ్యమంత్రి — దేవుడూ!

ప్రధాన మంత్రి — రాక్షసుడూ!

బంద్ — జయప్రదం కావాలి!

కేంద్రం — పడిపోవాలి!

రాష్ట్రం — గెలవాలి!''

మేము నినాదాలు చేస్తున్నంత సేపు జీప్‌లో నుంచి ఒకడు మామీద ఫ్లడ్ లైట్స్ వేసి వీడియో కెమెరాతో షూటింగ్ చేసేశాడు.

హోమ్ మంత్రి కెమెరామెన్ వైపు పరుగెత్తాడు.

''ఒరే వీడియోవాలా! జాగ్రత్తగా తియ్! పోలీసులు వాళ్ళ వీపులకు తుపాకి పెట్టటం ఫిల్మ్‌లోఎక్కడా కనబడకూడదు! అర్థమయిందా!''

''అయింది సార్'' అంటూ హోమ్ మంత్రి కాళ్ళు కళ్ళకద్దుకున్నాడతను. అప్పుడు మాశాం అతనిని మేము. అతను పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన ఐ.ఎ.ఎస్. అధికారి.

''ఇదిగో ముందే చెప్తున్నా వినండి! రేపు ఒక్క పిట్ట కూడా ఇళ్ళల్లో నుంచి బయటకు రాకూడదు. ఎవరికైనా జబ్బు చేస్తే పోలీసుల సహాయం తీసుకోండి! వాళ్ళు జబ్బు చేసిన వ్యక్తి రెండు రోజులు స్పృహ తప్పేట్లు కొన్ని మందులిస్తారు. స్పృహ వచ్చాక అప్పుడు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళవచ్చు. రేపెవరైనా చనిపోతే శవాల్ని మీ పెరట్లోనే తవ్వి పాతేసుకోండి గానీ శ్మశానాలకు వెళ్ళడానికి కూడా అనుమతి ఇవ్వబడదు. అర్థమయిందా?'' గట్టిగా అడిగాడు మినిస్టరు.

అందరం అయిందని తలూపాము.

వెంటనే జీప్, దాని వెనుకే పోలీసులతో వానూ వెళ్ళిపోయాయ్.

''దిసీజ్ టూ మచ్'' అన్నాడు రంగారెడ్డి కాసేపు నిశ్శబ్దంగా వున్నాక.

''అవును! ప్రజల్ని వీళ్ళు కుక్కల కంటె హీనంగా చూస్తున్నారు'' అన్నాడు శాయిరావ్.

అందరూ ఎవరి అభిప్రాయాలు వాళ్ళు చెప్తుండ గానే ఇంకో పెద్ద వాన్ చాల బలమయిన సారా వాసనతో రివ్వున వచ్చి మాముందాగింది. అందులో నుంచి పాతిక మంది లావుపాటి వ్యక్తులు తూలుతూ మా దగ్గరకొచ్చారు. అందరి చేతుల్లోనూ కర్రలున్నాయ్. ఒకరిద్దరు మాత్రం తుపాకులు పట్టుకుని నిలబడ్డారు.

''ఏయ్ ఈ కాలనీ కమిటీ ప్రెసిడెంట్, శెక్రటరీ ఎవరు?'' అడిగాడు ఒకడు. వాడు కింద పడి పోకుండా ఇంకో ఇద్దరు గట్టిగా పట్టుకుని నిలబెట్టారు.

మాకు వళ్ళు మండిపోయింది.

''ఏయ్ అంటావేందే! మంచిగా మాట్లాడడం రాదుబే నీకు?'' అన్నాడు యాదగిరి కోపంగా.

''ఏ్రటా? మంచిగా మాట్లాడాలా? నీయవ్వ'' అంటూ యాదగిరి మీద నలుగురు పడి చేతులు విరిచి కింద పడేశారు.

పరిస్థితి విషమించేట్లుందని రంగారెడ్డి, గోపాలావ్ ముందుకి వచ్చారు.

''నేనే కాలనీ శెక్రటరీని! ఈయన ప్రెసిడెంట్! మాతో ఏమిటి మీకు పని?'' అడిగాడు రంగారెడ్డి.

''గట్లు మంచిగ మాట్లాడాలి భాయ్! ఇగో సూడు! కేంద్రంలోని అధికార పార్టీకి ఈ ఏరియా లీడర్ని నేను! నా పేరు నర్సింహా! సమజైందా?'' అడిగాడతను.

''అయింది! ఇంతకూ మాతో ఏమిటి పని మీకు?'' మళ్ళీ అడిగాడు రంగారెడ్డి సౌమ్యంగా.

''ఏం లేదన్నా! రేపు ఈ ఫాల్తూ అపోజిషన్ కొడుకులు మన రాష్ట్రంల బంద్ చేయడానికి కోషిష్ జేస్తర్నము! బంద్ గిట్టజేస్తే జేస్కోనీ గాని, కిరికిరేడొస్తున్న దంటే — ఈ బంద్ జబ ర్దస్త్ చేస్తర్నన్నా! మన దేశం లగిల్ల జబర్దస్త్ చేసెడిది గంత్ కదా!''

''ఆ మాట నిజమే'' వప్పుకున్నాడు రంగారెడ్డి.

''అవునా అన్నా! జబర్దస్తే గాకుండా మీదికెళ్ళి మీ అందర్కీ పైసలు గిట్ట ఇచ్చి ఇళ్ళల్లోకెళ్ళి బయటకు రాకోద్దని జులుమ్ చేస్తున్నది. ఎంత బే ఇజ్జత్ సంగతిది?''

''అవ్! చాలా బే ఇజ్జత్'' అన్నాడు గోపాలావ్.

''ఇప్పుడు మేమొచ్చిన పనేమంటే రేపు ఎట్లయిన గానీ మనం ఈ బంద్‌ని ఫెయిల్ జేయాలె! అంటే మీరంతా ఆఫీసలకు వెళ్ళాలె! సమజైందా?''

మేము ఉలిక్కిపడ్డాం! ''ఏమిటి రేపు మేము ఆఫీస్‌ల కెళ్ళాలా?''

''బరాబర్ ఎళ్ళాలె! ఆఫీస్‌లకు పోనికి రెండు బస్‌లు మేమే ఎరేంజ్ చేస్తం. సమజయిందా?''

(ముగింపు వచ్చేవారం)

ఈ కథ సత్య అబద్ధం. అసలు ఈ ఇతివృత్తమే అతి దారుణమయిన కల్పితం. ఇందులోని పాత్రలూ, సన్నివేశాలూ, సంఘటనలూ, ప్రదేశాలూ, పోలీసులూ — అన్నీ కథా సౌలభ్యం కోసం కల్పించినవే! ఒకవేళ ఇందులోని చాలా అంశాలు (లేదా అన్ని అంశాలు) మన రాష్ట్రంలోని ప్రజా జీవితాల్ని పోలి ఉన్నట్టయితే అది కేవలం పరమ కాకతాళీయం. ఈ కథలోని సంఘటనలన్నీ తెలుగు రాజధానిలో ఉండవచ్చునని ఎవరికైనా అనిపిస్తే అది వారి భ్రమ మాత్రమే! (ఎందుకంటే మన రాజధాని పౌరులు ఎలాంటి అసౌకర్యాలూ లేకుండా సర్వసుఖాలతో తులతూగుతున్నారు కాబట్టి). ఈ కథలో కొన్ని దిక్కుమాలిన పాత్రలు వెలిబుచ్చిన అభిప్రాయాలతో గాని, వాడిన దౌర్భాగ్యపు పదజాలంతోగానీ రచయితకు ఎలాంటి సంబంధంగానీ, బాధ్యతగానీ లేదని మనవి.

ఇట్లు
రచయిత